క్లుప్తంగా

క్రీడారంగానికి ప్రాధాన్యం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని

తొర్రూరు: తెలంగాణ రాష్ట్రంలో క్రీడారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డిలతో కలసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, నాయకుల హమ్యానాయక్, సుంచు సంతోష్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి

మరిపెడ రూరల్: గిరిజన తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరరెడ్డి అన్నారు. మండలంలోని లూనావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరు అయిన రూ.9లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, వీరభద్రం పాల్గొన్నారు.

హర్షణీయం

గంగారం: నీతి అయోగ్‌లో దేశంలోని 500 మండలాలలో గంగారం మొదటి స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమని గంగారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష అన్నారు. నీతి అయోగ్ వారు ఇచ్చిన ఏడు ఆరోగ్య సూచికలలో గంగారం మొదటి స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఆర్థికసాయం

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2000–01 సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న మిత్రుడి తోటి స్నేహితుడి కూతురి పెళ్లికి రూ.56వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో ధరావత్ డాక్టర్ సుందర్, వీరేష్, మద్దెల మహేష్, శ్రీనివాస్, వల్లపు యాకన్న, రమేశ్, వీరన్న, దస్తగిరిపాషా, రవీందర్, శంకర్, సర్వసతి పాల్గొన్నారు.

27న ప్రవేశ పరీక్ష

మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అక్తర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 21నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఈస్టర్ వేడుకలకు సిద్ధం



మహబూబాబాద్ రూరల్: నేడు ఈస్టర్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని సీఎస్ఐ, బ్లెస్స్‌డ్, ఏసుశక్తి సహవాస, ఐపీసీ, మరనాత, షారోన్ చర్చిలతో పాటు మరికొన్ని చర్చిలను ప్రత్యేక అలంకరణ చేశారు.

21న జాబ్‌మేళా

పెద్దవంగర: నిరుదోగ్య యువతీయువకులకు ఉపాధి కల్పించేందుకు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ వారి ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న జాబ్ మేళాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు కాసాని హరీశ్ శనివారం తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో జాబ్‌మేళా ఉంటుందన్నారు.

నిర్వీర్యం చేసే కుట్రలు

నెహ్రూసెంటర్: దేశంలో కార్మికుల సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసే కేంద్ర బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గాదే లక్ష్మీనారాయణ అన్నారు. సంఘం జిల్లా 4వ మహాసభ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 55 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ రూ.3వేలు ప్రతినెల చెల్లించాలన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్, మంద శంకర్, శ్రావణ్, స్వామి పాల్గొన్నారు.

నమోదు శాతాన్ని పెంచాలి


పెద్దవంగర: వచ్చే విద్యా సంవత్సరం అన్నిప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం పై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

మూగబోయిన ట్రింగ్ ట్రింగ్

- సెల్‌ఫోన్ సునామీలో ల్యాండ్‌ఫోన్ గల్లంతు
- గ్రామీణ ప్రాంతాల్లో కానరాని వైనం

Sunday Special

పెద్దవంగర: ట్రింగ్ ట్రింగ్.. ట్రింగ్‌ట్రింగ్ అంటూ మార్మోగిన ల్యాండ్‌లైన్ టెలిఫోన్ మూగబోయింది. కాల గమనంలో అరచేతిలోకి సెల్‌ఫోన్ వచ్చి చేరడంతో ల్యాండ్‌లైన్‌కు ఆదరణ కరువైంది. రెండు దశాబ్దాల క్రితం స్టేటస్ సింబల్‌గా పిలుచుకొనే టెలిఫోన్ ప్రస్తుతం పల్లెల్లో పూర్తిగా కనుమరుగైంది. పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వం కార్యాలయాల్లో మాత్రం కాస్త అక్కడక్కడ ఉనికిని కాపాడుకోవడానికి ఊగిసలాడుతోంది. ఒకప్పుడు ఇళ్లలో రాజసానికి సింబాలిక్‌గా నిలిచిన ల్యాండ్‌ఫోన్.. సెల్‌ఫోన్ సునామీలో నేడు మ్యూజియం వస్తువుగా మారింది. శతాబ్దాలుగా పట్టణాలకే పరిమితమైన టెలిఫోన్ సౌకర్యం 1990లో మండలాలు, పెద్ద పెద్ద గ్రామాలకు చేరుకుంది. ఎవరితోనైన మాట్లాడాలని అనుకుంటే ఆ రోజుల్లో ట్రంక్‌కాల్ బుక్ చేసుకొని ఫోన్ మాట్లాడి వచ్చేవారు. 2000 వరకు దశాబ్దంపాటు ఓ వెలుగు వెలిగిన బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌ఫోన్ సేవలు రానురాను తగ్గుముఖం పట్టింది.



మొబైల్ ఫోన్ రాకతో..

2009వ సంవత్సరంలో మొబైల్ ఫోన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఫోన్‌కు 3జీ సెక్టార్ రావడంతో ఎక్కడి నుంచైన మాట్లాడుకునే సౌకర్యం కలిగింది. దీంతో పాటు మెసేజ్‌లు పంపుకునే వీలు కలుగుడంతో అటువైపుగా ప్రజలు మొగ్గుచూపారు. సెల్‌ఫోన్ ఇప్పుడు మానవ జీవితంలో అంతర్భాగం అయ్యింది. ల్యాండ్‌ఫోన్‌ను ఎక్కడికి తీసుకెళ్లే వెసులుబాటు ఉండేది కాదు. అనంతరం వచ్చిన సెల్‌ఫోన్‌లు సైతం భారీగా ఉండేవి. ప్రస్తుతం చిన్న పరిమాణంలో అధిక ఫీచర్లతో లభిస్తున్నాయి. ఫోటోలు, వీడియోలు తీయడానికి ఉపయోగపడుతూ స్మార్ట్‌ఫోన్లు మల్టీ కెమెరా సెటప్‌తో వస్తుండంతో ల్యాండ్‌ఫోన్‌లు మచ్చుకైన కనిపించకుండా పోయాయని పలువురు పేర్కొంటున్నారు.

నిరుద్యోగులు ఉపాధి పొందేవారు



ముప్పై ఏళ్ల క్రితం చదువుకొని ఉద్యోగం రాని నిరుద్యోగ యువత పట్టణాల్లో ఎస్‌టీడీ బూత్‌లు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేవారు. కాల క్రమేనా ల్యాండ్‌లైన్ స్థానంలో కాయిన్ బాక్స్‌లు రావడంతో గ్రామాల్లో ముఖ్య సెంటర్లలో కాయిన్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందారు. స్మార్ట్‌ఫోన్‌లు రావడంతో ఆ సేవలన్నీ కనిపించకుండాపోయాయి.

– రాసాల సమ్మయ్య, పోచంపల్లి

బీజేపీతో అంబేడ్కర్‌కు గౌరవం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌జీ

డోర్నకల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్, సంఘటన్ మంత్రి చంద్రశేఖర్‌జీ తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో శనివారం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు కాంగ్రెస్ పాలనలో ఎలాంటి గౌరవం లభించలేదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు అపార గౌరవాన్ని, సముచిత స్థానాన్ని కల్పించి వారి రుణం తీర్చుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, వైపీ రావు, యాపా సీతయ్య, రాంచందర్‌రావు, సంగీత, దేవిక, గణేష్‌నాయక్, దేవానాయక్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్ర బీజేపీ సంఘటన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఎడ్లబండ్ల ర్యాలీకి స్వాగతం పలకాలి

- మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగదీష్‌రెడ్డి

తొర్రూరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నుంచి ఎడ్లబండ్లపై ర్యాలీగా రానున్న రైతులకు ఘనంగా స్వాగతం పలకాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామశివారులో ఉన్న శ్రీనివాస గార్డెన్‌ను ఎడ్లబండ్లపై వస్తున్న రైతులకు వసతి కల్పించేందుకు ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎంతో అసంతృప్తితో ఉన్న రైతులు, మహిళలు, యువతి, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సీతారాములు, శ్రీనివాస్, అంజయ్య, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, మణిరాజ్, రవి, శంకర్, జైసింగ్, అంకూస్, కాలునాయక్, వెంకన్న పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో సర్వేనంబర్ 255/1లో సీపీఎం ఆధ్వర్యంలో మూడేళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న అర్హులైన నీరు పేదలకు ఇంటిస్థలాల పట్టాలు ఇవ్వాలి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్ణపు సోమయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణికి సీపీఎం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైన గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సింహులపేట: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను శనివారం పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంజీవరెడ్డి, జినుకుల రమేశ్, రామకృష్ణ, శ్రీనివాస్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిన చెక్కల గురువయ్య(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా సీరోలుకు చెందిన గురవయ్య ఈనెల 15న గ్రానైట్ ఫ్యాక్టరీలో పనికి వచ్చాడు. ఆ తర్వాత ఎం.వెంకటాయపాలెం వాసులైన తేనె సూరిబాబు, పాషాతో కలిసి గ్రామ చెరువులో బోట్ సాయంతో చేపల వేట కొనసాగించారు. తిరిగి వస్తుండగా బోట్‌లో కళ్లు తిరగగా గురువయ్య చెరువులో పడడంతో ఆయన సహచరులు బయటకు తీసి ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు..

దంతాలపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శనివారం ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన ఎనుగందుల బాబు(30) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్యాభర్తలు జీవనోపాధికోసం హైదరాబాద్ వెళ్లారు. భార్య సంధ్యతో కలిసి ఓ ప్రైవేట్ వసతి గృహంలో పనులు చేసుకుంటు జీవిస్తున్నారు. వేసవి కాలం సెలవులు రావడంతో ఇటీవలే గ్రామానికి వచ్చారు. శుక్రవారం రాత్రి సుమారు 11గంటల వరకు స్నేహితులతో బాబు కలిసి గడిపాడు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు కాని బాబు తన ఇంటి వద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను తహసీల్దార్ కృష్ణవేణి ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించనున్నట్లు రెవెన్యూ సిబ్బంది శ్రీను, రామకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్, కారు ఢీ వ్యక్తికి గాయాలు

దంతాలపల్లి: మండలంలో కారు, ట్రాక్టరు ఢీకొన్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన చాపల రాజేష్, అతడి స్నేహితుడు మధు ఓ కార్య నిమిత్తం కారులో పెద్దముప్పారం వెళ్తున్నారు. ఈక్రమంలో రేఖ్యతండా వద్ద ట్రాక్టర్, కారు ఢీకొన్నాయి. కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఢీకొంది. కారు టైర్ ఊడిపోవడంతో పాటు, కారులో ఉన్న రాజేష్ తలకు గాయాలయ్యాయి, చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ఏసుమార్గం అనుసరణీయం



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

నెహ్రూసెంటర్: ప్రపంచానికి శాంతి, సమానత్వాన్ని ప్రకటించిన ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని 'రన్ ఫర్ జీసస్' నిర్వాహకులు జన్ను మహేందర్, చాగంటి కరుణాకర్ అన్నారు. జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్, మహబూబాబాద్ క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని ఏసుక్రీస్తు శిలువ మరణ పునరుత్థారణ సందేశాన్ని ప్రకటించే గొప్ప కార్యక్రమం 'రన్ ఫర్ జీసస్' అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెల్లోషిప్స్, క్రిస్టియన్ యూత్ ఫెల్లోషిప్ సభ్యులు ఆర్సీఎం ఫాదర్ సైమన్ పీటర్, శంకర్ పాల్, సంపత్, మోజేస్, మంగీలాల్, జాన్ విక్టరీ, వినోత్, యేసుపాదం, లివింగ్ వాటర్, ఇజ్రాయేల్, అనుదీప్, సామ్యేల్, బుచ్చన్న, జాన్‌నాయక్, కృపాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎక్బాల్

మహబూబాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని నిరసిస్తూ ముస్లింలు ఈనెల 21న చేపట్టిన శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని వక్ఫ్‌బోర్డు పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎక్బాల్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఉమర్ ఫరూక్ మసీదులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లింల మత, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపును బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం రాజ్యాంగాన్ని కూడా మార్చే ప్రయత్నాలు భవిష్యత్‌లో చేస్తారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. శాంతి ర్యాలీలో అన్నివర్గాల ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, వక్ఫ్ బోర్డు పరిరక్షణ కమిటీ సభ్యులు ఫరీద్, అబ్దుల్ హమీద్, ముఫ్తీ ఆలంఘీర్, సయీద్ అహ్మద్ రిజ్వీ, అఫ్జల్, ఖలీల్, ఇబ్రహీం, యూసుఫ్ మేస్త్రీ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

- డీఎస్పీ తిరుపతిరావు



మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మానుకోట డీఎస్పీ ఎన్.తిరుపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసంతో లక్షసాధనలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైన కష్టపడి విజయం సాధించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాల అలవాట్లకు దూరంగా ఉండాలని, ప్రతి విద్యార్థి మంచి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం డీఎస్పీ తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మున్సిపల్ జేఈ కృష్ణమోహన్‌రెడ్డిలను కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగ రెడ్డి, కరస్పాండెంట్ సత్యనారాయణ, డైరెక్టర్ సాధన సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కెబి. శంకర్, పారామెడికల్, ప్రిన్సిపాల్ కృష్ణరావు, శ్రీపాల్‌రెడ్డి, పొక్కుల సదానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ తగాదాలో దాడి.. ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన మాలోత్ నరేశ్

కురవి: అన్నదమ్ముల మధ్య పొత్తులో ఉన్న భూమి పంచాయతీ ముదరడంతో శనివారం బలపాల శివారు లింగ్యా(బి) తండాలో మాలోత్ నరేశ్‌పై అతని బంధువు మాలోత్ మోహన్‌తోపాటు మరికొందరు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం బలపాల శివారు లింగ్యా(బి)తండాలో మాలోత్ భోజ్యా, మాలోత్ దళిసింగ్, మాలోత్ తేజ్యాలు అన్నదమ్ములు. వీరికి పొత్తులో భూమి ఉంది. ఆ భూమికి సంబంధించిన గొడవ జరుగుతుంది. ఈక్రమంలో శనివారం మాలోత్ దళిసింగ్ కొడుకు మోహన్ భూమిలో రాళ్లు తీసే క్రమంలో రాళ్లను ఎందుకు తీస్తున్నావని నరేష్‌కు సంబంధించిన వ్యక్తులు అడిగారు. దీంతో మాలోత్ మోహన్, దళిసింగ్, మాలోత్ సక్కు, కవిత, సుగుణలు కలసి నరేష్‌ను విపరీతంగా కొట్టారు. తలకు, మెడకు, చేతులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి నరేష్‌ను తరలించి చికిత్స అందించారు. ఇదే విషయమై కురవి ఎస్సై గండ్రాతి సతీష్‌ను వివరణ కోరగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

గార్ల: ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వానికి రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులకు రుణమాఫీ పూర్తిగా చేయకుండా కేవలం 60శాతం మంది రైతులకు మాత్రమే చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, వీరస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సదస్సును జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఆపరేషన్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హింసకాండను నిరసిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నేడు నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనప పొమ్మన్న, బండపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘం ముఖ్యనాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమమంలో భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడ: గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశాడు. శనివారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. ఈ సమావేశంలో ల్యాదల్ల రాజు, మిడుతపల్లి రవి, చింత యాకయ్య, కుమారస్వామి, రాకేష్, సాగర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలో చేరాలి

కురవి: మండలంలోని మోద్గులగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం గ్రామంలో బడి బాట ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను ముద్రించి గ్రామంలో పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దయ్యాల మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకన్న, శ్రీనివాస్, లక్ష్మీదుర్గ, సరిత, రయేసబేగం పాల్గొన్నారు.

జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మరిపెడ రూరల్: ఈనెల 26న మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో తలపెట్టిన మాకుల జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు అన్నారు. శనివారం మండలంలోని తండాధర్మారంలో లంబాడీల ఐక్య వేదిక సంఘం ఆధ్వర్యంలో మాకుల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాఠశాలల భాగస్వామ్యంతో ముందడుగు

గూడూరు: మండలంలోని పాఠశాలల భాగస్వామ్యంతో విద్యార్థులు, పాఠశాలలు ముందడుగులో ఉంటాయని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో శనివారం ట్వినింగ్ (పాఠశాలల భాగస్వామ్యం) కార్యక్రమం నిర్వహించారు. ఉత్తములకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రమేశ్, భిక్షపతి, అనిత, నిర్మల, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు తరలిన నాయకులు

మరిపెడ రూరల్: ఈనెల 19, 20, 21 తేదీల్లో హనుమకొండ హరిత హోటల్లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ, గిరిజన శిక్షణ తరగతులకు శనివారం మండలం నుంచి పలువురు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. అజ్మీర శ్రీనివాస్‌నాయక్, జర్పుల విజయ్‌నాయక్, బానోతు శరత్‌నాయక్ ఉన్నారు.

నాణ్యతతో ధాన్యం తీసుకురావాలి

మహబూబాబాద్ రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని అరబెట్టుకుని తీసుకురావాలని సెర్ప్ ఐకేపీ ఏపీఎం తిలక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఐకేపీ ఏపీఎం తిలక్ ప్రారంభించారు.

ఉద్యమకారుల ప్లీనరీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం: హైదరాబాద్‌లో ఈనెల 21వ తేదీన జరగనున్న ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం వాల్ పోస్టర్లను మున్సిపాలిటీ పరిధిలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూ నాయక్, సంఘం మండల ప్రధాన కార్యదర్శి షేక్‌ఖాదర్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాలీ

కొత్తగూడ: అదుపు తప్పి టాటా ఎస్ ట్రాలీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన శనివారం మండలంలోని ఓటాయిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం నుంచి టెంటు సామగ్రిని తీసుకెళ్లడానికి వచ్చిన ట్రాలీ ఆటో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి ఒకవైపుకు ఒరిగి తలపై ఆగడంతో పెను ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మానుకోట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి ఉదయం మహబూబాబాద్‌కు వెళ్తుంది. మన్నెగూడెం సమీపంలో భారీ గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీలోని రాయి బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఏసు అనే వ్యక్తికి గాయాలు కావడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డోర్నకల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చేనులో మేసిందని ఆవుపై గొడ్డలితో దాడి

కురవి: జొన్న చేనులో ఆవు మేసిందని ఆగ్రహించిన ఓ వ్యక్తి ఆవును గొడ్డలితో ఆవుపై కిరాతకంగా దాడికి పాల్పడిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలంలోని బలపాల శివారు లింగ్యా(బి) గ్రామంలో మాలోత్ బాలకృష్ణ అనే రైతుకు చెందిన జొన్న చేనులో అదే తండాకు చెందిన బానోత్ శంకర్ అనే రైతుకు చెందిన ఆవు శుక్రవారం సాయంత్రం మేత మేస్తోంది. చేనులో పడి మేత మేస్తుందని ఆగ్రహించిన బాలకృష్ణ అనే రైతు తన చేతిలో ఉన్న గొడ్డలితో ఆవుపై దాడి చేసి నరకడంతో ఆవు వీపుపై తీవ్రంగా గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ శనివారం తెలిపారు.